# కరుణా నర్సింగ్ హోమ్

డా॥ దయ
ఎమ్. బి. బి. యస్.

డా॥ (శ్రీమతి) కరుణ
ఎమ్. బి. బి. యస్; డి. జి. ఓ.

**ఆ నగరంలో ప్రఖ్యాతి చెందిన నర్సింగ్ హోం కాంపౌండ్ గోడమీదున్న బోర్డు అది.**

ఆనాటికి పని ముగించుకొని-యిక వెళ్ళనా?- అన్నట్లు నర్స్ వైపు చూసింది డాక్టర్ కరుణ

"పదమూడో నంబర్ గదిలో ఫ్యాన్ తిరగడం లేదమ్మా" అంది సంకోచంగా-నర్స్ విమల.

"రేపు బాగు చేయిద్దాంలే."

"బాబోయ్! ఫాన్ తిరక్కపోతే ఆ రాక్షసి నన్ను కాల్చుకు తినేస్తుందీ రాత్రి. స్పెషల్ గది అని చెప్పి రోజుకు పదిహేను రూపాయిలు అద్దె వసూలు చేస్తూ ఫ్యాన్ పెట్టకపోతే ఎలా? అని రూల్స్ మాట్లాడుతుందమ్మా అంది."

"ఆమెను యింకో గదిలోకి మార్చు"

"స్పెషల్ గదులేవీ ఖాళీగా లేవు"

"అయితే ఫ్యాన్ బాగుపడేవరకూ అద్దె తగ్గించి వసూలు చెయ్యి."

నిర్ఘాంతపోయింది విమల. ఆ ఫ్యాన్ గత మూడు నెలలుగా తిరగడం లేదు. అయినా రోగులెవరూ ఫిర్యాదు చేయలేదు. చేసినా, అద్దె తగ్గింపుగాని, ఫ్యాన్ రిపేర్ గాని జరగనేలేదు. ఆ రాక్షసి అంటే డాక్టరమ్మకీ భయమే కాబోలు!

పదమూడో నంబరు రాక్షసి పేరు స్మిత. తాడూ, బొంగరమూ లేవుగాని డబ్బూ సుఖవ్యాధులూ పుష్కలంగా వున్నాయి. ఆ నర్సింగ్ హోంలో సిబ్బందికి పెద్దగా జీతాలివ్వరు. వాళ్ళు రోగులవద్ద మామూళ్ళు గుంజుతూ వుంటారు. ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది జలగలయితే, నర్సింగ్‌హోం సిబ్బంది నల్లులూ, దోమలూ!

కాని స్మిత వద్ద వాళ్ళ పప్పులుడకవు. "రోగుల సేవచేయడానికే మీకు జీతాలిస్తున్నారు. నా సేవ చేసుకోండి. డాక్టరమ్మ నుంచి జీతం తీసుకోండి" అని రూల్సు మాట్లాడుతుంది ఆమె.

"కుక్కలాగ మగవాళ్ళ వెంటపడడం, రోగాలు తగిలించుకోవడం- మరో ఆడదైతే సిగ్గుతో చచ్చిపోతుంది. ఈ మహాతల్లిమాత్రం...." అసహ్యంగా అంది విమల ఆమె మాట పూర్తికానే లేదు....

"నోర్ముయ్! మాకు రోగాలొస్తేనే మీలాంటి వాళ్ళు బ్రతికేది. మేమే నీకెంత కూడు పెడుతున్నాం కూడు పెడుతున్న వాళ్ళనే తిట్టే నీలాంటి వాళ్ళేసిగ్గుతో చావాలి. నేను కాదు!"

అక్కడకు ఎప్పుడు వచ్చిందో, ఏమో, స్మిత గర్జించింది.

విమల పిల్లిలా గది బయటకు వెళ్ళిపోయింది.

నర్సు భావాలతో మీరూ ఏకీభవిస్తున్నారా? అన్నట్లు తీవ్రంగా డాక్టరమ్మ వైపు చూసింది స్మిత. తప్పు చేసినదానిలా తల వంచుకుంది కరుణ.

"నా రోగం-ఆసుపత్రిలో చేరవలసినంత తీవ్రం కాదని నాకు తెలుసు. మీరే కాదు, ఏ డాక్టర్ అయినా నయం చేస్తాడనీ తెలుసు. కాని నేను మీ నర్సింగ్ హోంలోనే ఎందుకు చేరానో తెలుసా?"

అవునూ, ఎందుకు చేరావు? అన్నట్లు చూసింది కరుణ కుర్చీలో కూర్చుంటూ. ఎదురుగా తనూ కూర్చుంది స్మిత. "మీరు మంచిరచయిత్రి. మీ రచనల్లో అభ్యుదయ భావాలు కనిపిస్తాయి. స్త్రీజాతిపట్ల సానుభూతి, అవగాహన కనిపిస్తాయి. మీ పరిచయం చేసుకోవాలని-యిక్కడ చేరాను."

తన రచనల ప్రసక్తిరాగా, మురిసిపోయింది కరుణ.

"నా నవలలు ఎన్ని చదివావు?" అడిగింది.

"ఇంచుమించుగా అన్నీ చదివాను. నాకు నచ్చిన నవల- నాగిని.

మగవాడి అత్యాచారానికి గురి అయిన స్త్రీ కథ నాగిని. ఆమె మొదటకుంగిపోయినా తర్వాత ధైర్యం తెచ్చుకుని మొండిగా బ్రతుకుతూ చివరకు అతనిమీద పగతీర్చుకుని-నాగుపాములా బుసకొడుతూ స్త్రీజాతికి ఒక సందేశమయిస్తుంది- "అత్యాచారానికి గురి అయిన స్త్రీలారా! ఆత్మహత్య చేసుకోకండి! సిగ్గుతో తల వంచుకోకండి! నా లాగ బ్రతకండి. నా లాగ పగ తీర్చుకోండి"- అని.

"నేనుకూడా నాగినిలాగ బ్రతుకుతున్నా. కాని విమల లాంటి వాళ్లు ఈసడిస్తూనే వున్నారు. నాగిని లాంటి పాత్రను సృష్టించిన మీ హృదయంలో కూడా నా పట్ల సానుభూతి లేనట్లే కనిపిస్తోంది" నిష్ఠూరంగా అంది స్మిత.

"నీకు అలాంటి భావం కలిగించిన నా ప్రవర్తనకు....సారీ! కానీ, నీపట్ల నాకు పూర్తిగా సానుభూతి వుంది.... నమ్మ."

స్మిత కళ్ళు మెరిశాయి. "స్త్రీకి స్త్రీయే శత్రువంటారు. మీరు శత్రువో, ఆత్మీయులో నాకే అర్థం కావడం లేదు" అంది నెమ్మదిగా.

"అది బూజుపట్టిన సామెత. నీకు చేయూతనివ్వడం డాక్టర్‌గానేకాక- రచయిత్రిగా కూడా నా బాధ్యత." "థాంక్యూ డాక్టర్! మీ బాధ్యత ఎలా నెరవేర్చుకుంటారో నేను చూస్తాను" విసవిస తన గది లోనికి వెళ్ళిపోయింది స్మిత.

భార్యను పిలవడానికి వచ్చిన డాక్టర్ దయ గుమ్మం వద్దనే బొమ్మలా ఆగిపోయాడు- వాళ్ళ సంభాషణ వింటూ. స్మిత వెళ్ళిపోయినా, అతగాడు తేరుకోనే

## ఆడది - ఆవేదన

ఆడదానిగా, ఆలిగా
అవతరించిన ఓ స్త్రీ!
అనుమానం, అసూయలు
నీ జీవిత నేస్తాలే కదూ?
అందుకేనేమో,
ఆవేదనలూ, ఆరని జ్వాలలూ
నిన్నంటే వుంటాయి తోబుట్టువుల్లా!
ఆడపడుచులే నీ పాలిట కష్టాలు,
అత్తమామలే నీ స్వేచ్ఛకు ఆనకట్టలు!
ఆదరించే భర్తే అవుతాడు నీకు
ప్రతిబంధకం!
ఇక నీ జీవితమే ఓ సుడిగుండం!
అది నీ బతుక్కే- యమగండం!!

—బి. శారదాదేవి



లేదు. "ఏమిటీ పరధ్యానం పదండి."

భార్య హెచ్చరికతో ఈ లోకానికి వచ్చాడు దయ.

* * *

"ఎవరినైనా ప్రేమించావా?"

డాక్టర్ దంపతులు వెళ్ళిపోయాక— డ్యూటీరూంలో విశ్రాంతిగా కూచుని ఆలోచిస్తున్న నర్స్ విమల ఉలిక్కిపడి చూసింది. ఎదురుగా నవ్వుతూ స్మిత! మందస్మిత వదనారవింద! రాక్షసిలా కాదు. దేవతలా కనిపిస్తోంది! ఎవరినైనా ప్రేమించావా?" రెట్టించింది స్మిత

ఒకరిని కాదు. ఐదారుగురిని ప్రేమించింది విమల! కాని ఎవరూ ఆమెవైపు రెండోసారి చూడనైనా చూడలేదు. ఆమె జీతమూ, శరీరమూ ఎవరికీ అక్కరలేక పోయాయి.



ఇటీవల 'ఆంధ్రజ్యోతి' ఆవరణలో కరాటే ప్రదర్శన ఇచ్చిన హైదరాబాదుకు చెందిన ప్రముఖ కరాటే ఎక్స్‌పర్ట్ శ్రీ కె. ఎల్. సురేందర్ బృందం. శ్రీ సురేందర్‌కు మెమెంటో బహూకరిస్తున్న ఆంధ్ర ప్రింటర్స్ ఫైనాన్స్ మేనేజర్ శ్రీ కానూరి వెంకటరత్నం. మధ్య బాలజ్యోతి అసిస్టెంట్ ఎడిటర్ శ్రీ శశికాంత్ శాతకర్ణి

"ప్రేమించడం ఒకఅదృష్టం. ప్రేమించబడటం ఒక వరం" దీర్ఘంగా నిట్టూర్చి విరాళగా అంది వృద్ధకన్య విమల!

"కాదు. ప్రేమ ఒక శాపం! ప్రేమించబడడం ఒక నరకం" తీవ్రంగా అంది స్మిత.


ఆ తీవ్రత విమలకు విస్మయం కలిగించింది.

"నేను ప్రేమించాను. ప్రేమను పొందాను. ఆ రోజుల్లో నాకాళ్ళు మబ్బుల్లో నృత్యం చేసేవి. హృదయం స్వర్గంలో విహరించేది. ప్రపంచం అందాల నందనవనంలా కనిపించేది. ప్రేమించి మోసపోయిన ఎన్నో సంఘటనలు నవలల్లో చదివాను. సినిమాల్లో చూశాను. కాని నేను ఆ హీరోయిన్‌ల వలె చవటను కాను. నావాడు ఆ హీరోల్లాగ మోసగాడు కాదు- అని దృఢంగా విశ్వసించాను. నిజానికి ప్రేమించిన అందరూ అలాగే విశ్వసిస్తారు కాబోలు. ఆ విశ్వాసంతోనే ఒక అడుగు ముందుకు వెళ్ళి అగాధంలో కూలిపోయాను...." స్మిత స్వరం కంపించింది.

ఎందుకనో విమలకు ఆనందం కలిగింది. "మా బాగా అయింది!" అనుకుంది కసిగా.

గొంతు సవరించుకొని, శూన్యంలోకి చూస్తూ నెమ్మదిగా అంది స్మిత. "ఆ తర్వాతనే నరకంఅంటే ఏమిటో తెలిసింది. ఆ బడుద్ధాయి కొంతకాలం ముఖం చాటేశాడు. నిలదీసి అడిగితే- చదువు పూర్తి కాలేదు. ఉద్యోగం లేదు. ఇప్పుడు పెళ్ళేమిటి!- అని నవ్వేశాడు. పైగా ఈ రాత్రి ఎక్కడ కలుసుకుందాం- అని అడిగాడు వేళాకోళంగా నవ్వుతూ. పదిమంది ముందు నన్ను పిలిచి మాట్లాడ్డం గుట్టురట్టుచేయడం మొదలు పెట్టాడు. ఇల్లు ఒక సుడిగుండం. సంఘం ఒక అగ్నిగుండం అయింది. ఆ అగ్నికి ఆజ్యంలా తయారయాడు ఆ వెధవ....నా మచ్చను కప్పిపెట్టి పెళ్ళి ప్రయత్నాలు మొదలు పెట్టారు మా వాళ్ళు. అతనికి ఎలా తెలిసేదో, వాళ్ళకి ఉత్తరాలు రాసి సంబంధాలు చెడగొట్టేవాడు. జరిగిందేదో జరిగింది. నన్ను పెళ్ళి చేసుకో నక్కరలేదు. అంతా మరిచిపోయి ఎవరిదారిన వారు బ్రతుకుదాం. నా జీవితం నాశనం చేయ వద్దు అని ప్రార్థించాను. నెల రోజులపాటు ప్రతిరాత్రి తన రూంకి వచ్చి పరువాల విందుచేస్తే అప్పుడు మంచి స్నేహితుల్లా విడిపోదాం అన్నాడు గలగల నవ్వుతూ. వాడికి పెళ్ళి వద్దు కాని నా శరీరం కావాలి. అందుకు బ్లాక్ మెయిలింగే కాదు మరేమన్నా చేస్తాడు వాడి నిజస్వరూపం అర్థం అయింది. వాడికి చెలగాటం. నాకు ప్రాణసంకటం.... అలా ఆరెన్నెల్లు గడిచాక చిన్న ఉద్యోగం సంపాదించి నేను మరో ఊరు వెళ్ళిపోయాను. కాని ఆ ఊరుకి నాకీర్తి నాకన్నా ముందే చేరింది!. పురుష జనారణ్యంలో ఒంటరి లేడిని! నిగ్రహించుకొని. ఎదురు తిరిగి. బ్రతిమాలి- ఇవేవీపనికిరాక చివరకు భంగపడిఒక్కొక్క మృగానికీ లొంగిపోతూ-ఇదిగో యిప్పటికి యిలాగ తయారయాను. మగ మనస్తత్వం పూర్తిగా అవగతం అయింది. స్త్రీని లొంగ తీసుకోవడానికి ప్రయత్నించే మగాడు ఆమె లొంగినట్టుకనిపిస్తేచాలు.ఆమెకు బానిసఅవుతాడు. కనుసన్నల్లో మెలుగుతాడు. దాసోహం అంటాడు.... పెళ్ళి చేసుకో మనకూడదు-అంతే వాడికి కావలసింది....






నేను మంచిగా బ్రతకడానికి సాటి స్త్రీలే చేయూత నివ్వలేదు. ఇంక మగాళ్ళని నిందించి ప్రయోజనం ఏమిటి? అందుకే నాలోని మంచితనాన్ని మూటగట్టి మూల పారేశాను. మగాళ్ళని గంగిరెద్దుల్లా ఉపయోగించుకుంటున్నాను. నాకు నా అన్నవాళ్ళు లేకపోవచ్చు. విజిల్ వేస్తే చాలు కుక్కల్లా చుట్టూమూగి నన్ను రక్షించే పురుష పుంగవులున్నారు.... ఇప్పుడు నా జీవితం సుఖంగానే సాగిపోతోంది—" హఠాత్తుగా లేచి తన గదిలోకి వెళ్ళిపోయింది స్మిత.

ఆమెను అసహ్యించుకోవాలా, జాలిపడాలా—అర్థం కాలేదు విమలకు

* * * *

కునుకుపాట్లుపడుతున్న విమల ఉలిక్కిపడి కిటికీ వైపు చూసింది. బయట వరండా మీద ఎవరో వేగంగా వెళ్తున్నారు.... అర్థరాత్రి వేళ... ఎవరై ఉంటారు?

గబుక్కున లేచి కిటికీ వద్దకు వెళ్ళి చూసింది.

అప్పుడే వరండా మలుపు తిరిగి మాయమైన ఆ వ్యక్తి .... డాక్టరుగారా!? నడక ఒడ్డు పొడవూ—అలానే వున్నాయి.... తనకు తెలియని ఎమర్జెన్సీ కేసు లేవీ లేవు.... ఆయన ఎందుకు వచ్చినట్లు?

ఏం చేయాలో తోచక కాసేపు అలాగే వుండిపోయింది విమల.

ఆమె ఆలోచనలు డాక్టర్‌గారి మీదకు మళ్ళాయి

డాక్టర్ దయ—అందగాడు. మంచివాడు. సమర్థుడు—అలా కనిపిస్తాడు! కాని కరుణకు తగినవాడు కాదని - విమల నమ్మకం. కరుణ నిజంగా దేవత. రోగులందరూ ఆమెను ఆరాధిస్తారు. దయను - డాక్టరమ్మగారి భర్తగానే తప్ప ఆయనొక డాక్టర్‌గా భావించరు.

... పైగా ఆయనకు స్త్రీ వ్యసనముందనీ, భార్య కంటపడకుండా క్లబ్బుల్లో, లాడ్జిల్లో వ్యవహారం సాగిస్తూ వుంటాడనీ—గుసగుసలు విన్నది విమల.

ఆయనగారు యిప్పుడీ అర్ధరాత్రి వేళ యిక్కడ కెందుకు వేంచేసినట్లు? తనను లేపకుండా ఎందుకు వెళ్తున్నట్లు?

కొరడా దెబ్బలా ఛెళ్ళున ఒక ఆలోచన తగిలింది విమలకు. గబగబ పదమూడో గది వైపు వెళ్ళింది. ఆ గది తలుపులు కిటికీలు మూసి వున్నాయి.

కిటికీ రెక్క కొద్దిగా తోసింది. గడియ లేదేమో—వెంటనే తెరుచుకుంది లోనికి చూసిన విమల హృదయం దిగ్భ్రాంతి. కోపం. అసహ్యంతో ఉక్కిరిబిక్కిరి అయింది.

వెంటనే ఫోన్ వద్దకు పరిగెత్తింది.

మరో పావుగంటకు—

కిటికీ పూర్తిగా తెరిచి లోనికి చూసిన కరుణ కళ్ళు నిప్పులు కురిశాయి. హృదయం భగ్గుమంది.

కిటికీలోంచి డాక్టరమ్మ చూస్తున్నట్లు గమనించిన స్మిత తొణకలేదు. బెణకలేదు. మామూలుగానే వచ్చి తలుపులు తెరిచింది. డాక్టరమ్మను లోనికి ఆహ్వానించింది.

దయ మాత్రం గజగజ వణికిపోతున్నాడు. తల వంచుకొని ఒక మూల ఉండిపోయాడు. అతని వైపు చూడడమే పరమ రోతగా అనిపించింది కరుణకు. ఆమె నోట మాట రావడం లేదు.

"మీ ఆయన ఎలాంటి వాడో చూశారు కదా డాక్టర్! మీరు మరో నవల రాయడానికి చక్కటి ప్లాట్!" నవ్వింది స్మిత.

విమలకు కంపరంగా వుంది. ఇంత జరిగినా సిగ్గులేకుండా నవ్వుతున్న ఇది స్త్రీయేనా!!

కరుణ రోషంగా స్మిత వైపు చూసింది. ఏం మాట్లాడాలో, ఈ పరిస్థితిని ఎలా ఎదుర్కోవాలో అర్థం కావడం లేదా మహా రచయిత్రికి!

నవ్వు ఆపి గంభీరంగా మారింది స్మిత. "నా కథ విమలకు చెప్పాను. ఆమె నుంచి తెలుసుకోండి డాక్టర్! కానీ నేనొక్క విషయం మీకు చెబుతాను. నా జీవితం యిలా నాశనం కావడానికి కారణం— అదిగో ఆ మూల నక్కలా పొంచివున్న డాక్టర్ దయ! నాగిని లాంటి పాత్రను సృష్టించిన మీరు యిప్పుడు తీర్పు చెప్పండి. నా జీవితాన్ని నాశనంచేసిన అతనిని నేనేం చేయాలి? మీరేం చేస్తారు? స్త్రీకి స్త్రీయే శత్రువులన్న విషయం మీరు కూడా నిరూపిస్తారా? లేక నాకు న్యాయం కలగజేస్తారా? నిర్ణయం మీదే!"

అంటూ అప్పటికే సర్దుకుని ఉంచుకున్న సూట్‌కేస్ అందుకుని వెనక్కి చూడనైనా చూడకుండా చకచక బయటకు వెళ్ళిపోయింది స్మిత.

ఇంకా తల వంచుకుని ఆ మూల అలాగే నిలిచివున్న భర్త వైపు చూసింది కరుణ. ఆ చూపులో ఆర్ద్రత మాత్రం లేదు.

* * *

నగరంలో అధిక జనాదరణ గల నర్సింగ్ హోం కాంపౌండ్ గోడ మీద ఇప్పుడు వున్న బోర్డు యిది—

కరుణా నర్సింగ్ హోమ్
డా॥ కరుణ
ఎమ్. బి. బి. యస్: డి. జి. ఓ.